# పొరుగింటి పిన్నిగారు

శ్రీమతి వి. ప్రభావతీ దేవి

"భోజనా లయినాయా అక్కయ్యగారూ ?" అంటూ పొరుగింటి పిన్నిగారు మా హాల్లో అడుగు పెట్టారు. ఆవిడగారు మా యింట్లో అడుగు పెట్టటం ఆలస్యం— గదిలో ఉన్న మా అన్నయ్య వీథిలోకీ, హాలులో కూర్చుని చదువుకుంటున్న నేను గదిలోకీ చల్లగా జారుకున్నాం. వీథిలోకి వెళ్ళిపోతున్న అన్నయ్యనిచూసి నేనూ, నన్ను చూసి అన్నయ్యా— ఒకర్నిగురించి ఒకరం జాలిపడుతూనే— చిలిపిగా నవ్వుకున్నాం. ఆ నవ్వులోని అంతరార్థం బహుశః పిన్నిగారూ గ్రహించుకునే ఉంటారు. కాని ఏమీ తెలియనట్టు నటించారు. అయినా అంత తేలిగ్గా పైకి తేలిపోయే రకంకాదు లెండి ఆవిడ.

వంట ఇంట్లోంచి అమ్మ, గదిలోనుంచి వదిన వచ్చి ఆవిడకు కూర్చోడానికి చాపవేసి ఉచితరీతిని మర్యాదలు చేసి, ఆవిడ చెప్పే లోకాభిరామాయణానికి కుతూహలంతో చెవి ఒగ్గారు— అయినా పిన్నిగారి బారినుంచి తప్పించుకోవటం ఎవరి తరం? భయపడి దూరంగా నైనా తొలగిపోతారు గాని ఆవిడ ఎదురుగుండా నించుని ఎదిరించడానికి ఎవరూ సాహసించలేరు. పోనీ మేమంటే ఆడవాళ్ళం ; అభిజాత్యం అడ్డువస్తుం దనుకోండి. అన్నయ్యకూడా భయపడాలా !— తన ఆఫీసులో ఎంత పెద్ద ఆఫీసరు నయినా లెక్కచెయ్యని అన్నయ్య చిన్నతనం నుంచీ పొగరుమోతు వాడనీ, రౌడీ అని పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న అన్నయ్య- వీథిలో ఎక్కడైనా పిన్నిగారు తారసిల్లితేచాలు- హడిలిపోయి ఒక్క ఉదుటున ఇంట్లో జొరబడి "బాబోయ్ ! పిన్నిగారేవ్ !" అంటూ వీధి తలుపులు బిడాయించేసిన ఘట్టాలుకూడా ఉన్నాయి ఆ దృశ్యంచూస్తూ పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వే వదిననీ నన్నూ చూసి ఉడుకుమోతు తనంతో అన్నయ్య కోపం తెచ్చుకున్న రోజులూ ఉన్నాయి. ఇంతకూ తోటి మనిషిని చూసి పులినో భూతాన్నో చూసినట్టు అంత బెదిరిపోయా డనటం అతిశయోక్తి కాదా- అనే సందేహం చాలా మందికి రావచ్చు. అలా సందేహించినవారికి ఎదటివాళ్ళ కష్టసుఖాలు అర్థం చేసుకుని సానుభూతి చూపించేటంత సంస్కారం లేదనే విషయం- ఒక సుప్రభాతాన నేనూ అన్నయ్యా కలిసి తీవ్రంగా చర్చించి ఆలోచించి చివరికి తీర్మానం చేశాం— ఈ విషయాన్నే అన్నయ్య అయితే రుజువులూ సాక్ష్యాలతోసహా నాకంటె మరింత గట్టిగా నొక్కి వక్కాణించగలడు....

అదేం గారడీయోగాని- అమ్మకీ వదినకీ మాత్రం ఆ పిన్నిగారిమీద తగని వ్యామోహం. "కారణ మేమిటి చెప్మా !" అని నాలో నేనే ఎన్నో సార్లు తర్కించుకున్నాను. ఎంత ఆలోచించినా అది నా ఊహ కందని విషయంగానే కనిపించింది. ఇరుగూ పొరుగూ, ఊరూ వాడా అందరూ ఏకమై పిన్నిగార్ని గురించి ఏకాభిప్రాయానికి వచ్చి అందరూ తమ జాగ్రత్తలో తాము ఉన్నారంటే వాళ్ళంతా అమ్మకంటే, వదినకంటే తెలివి తక్కువవాళ్ళా అనిపించేది నాకు. ఒకొక్కప్పుడు తలుచుకుంటే అమ్మమీద వదినమీద పట్టరానికోపం వచ్చేది. అయినా ఏంలాభం? వాళ్ళిద్దరూ పిన్నిగారి పక్షమే! వాళ్ళు తమ అభిప్రాయాన్ని మార్చుకోరు. అంతగా ఎప్పుడైనా నేను నిలవేసి అడిగితే "పోనీలేవే పాపం ! మనుషులంతా ఒక్కలాగే ఉంటారా ? ఎవరి స్వభావాలు వాళ్ళవి. మనం సరిపెట్టుకు పోవటంలోనే ఉంది గొప్పతనం !" అంటుంది అమ్మ నెమ్మదిగా— అదేదో చాలా మామూలు విషయమైనట్టు- నిజంగా ఈ విషయంలో మా అమ్మకి ఉన్న సహనశక్తిని మెచ్చుకోవలసిందే !

"ఇంతకూ పిన్నిగారంటే అంత భయం దేనికి ? ఆవిడేం దెయ్యమా భూతమా ? ఆవిడా మామూలు మనిషేగా ?" అనిపిస్తుంది ఆవిణ్ణిగురించి కొత్తగా వినే వాళ్ళకి ... పిన్నిగారిని నిలువునాపుస్తకంలా చదివేసిన వాళ్ళకీ, ఆవిడ స్వభావాన్ని కాచి వడబోసిన వాళ్ళకీ తెలుస్తుంది ఆ బాధంతా. ఆవిడ పరోపకారగుణం, ఆవిడ ఔదార్యం, ఆవిడ ఔన్నత్యం ఆవిడతోనే ఆగిపోతే

బాగుండును. కాని అలా ఆగవుగా! చివరికి ఇరుగు పొరుగు వాళ్ళకి పీకెలమీదికి కూడా తెస్తాయి.

పొరుగింటి పుల్లయ్యగారి అమ్మాయిలకి ఇంకా పెళ్ళి సంబంధం కుదరలేదంటే పిన్నిగారికే దిగులు; ఆ సంగతి తల్చుకుంటే ఆవిడగారికి రాత్రింబగళ్ళు నిద్రాహారాలు ఉండవు పాపం! మరో పక్కింటి ఎల్లమ్మగారి కూతురు రెండు సార్లు పరీక్ష ఫేలయిందంటే పిన్నిగారికి పట్టరాని కోపం! తండ్రి సంపాదించే డబ్బంతా ఆడపిల్ల చదువుకే తగలేస్తున్నారంటుంది. ఎదురింటి రాజమ్మగారి మరిదికి ఇంకా ఉద్యోగం దొరకలేదంటే పిన్నిగారికే నామోషీ. వెంకమ్మగారి మరిది ఉద్యోగం చేస్తూ తన జీతంలో ఒక్క కానీకూడా ఇంట్లో ఇవ్వకుండా అంతా తన సొంత ఖర్చులకిందె దుబారా చేస్తున్నాడని పిన్నిగారు రాత్రింబగళ్ళూ మహా ఇదయిపోతూ ఉంటారు. పక్క వీధిలో ప్లీడరుగారి కొడుక్కి పెళ్ళి అయి నాలుగేళ్ళు అయినా ఇంకా సంతానం కలగలేదని పిన్నిగారి హృదయం ఎంత తల్లడిల్లి పోతోందో! పక్కింటి నరసమ్మగారి మొగుడికి ఆఫీసులో ప్రతి సంవత్సరం తప్పకుండా జీతం ప్రమోషన్ అవుతుందోలేదో అని అమిత శ్రద్ధగా పిన్నిగారు అప్పుడప్పుడూ వచ్చి కనుక్కునిపోకుండా ఉండలేరు. పొరుగింటి మేష్టరుగారి భార్యకి సరిగ్గా చీరలూ అవీ కొంటున్నాడోలేదో అని ఇక ఆవిడ పడే బాధ ఆ భగవంతుడికి తెలియాలి.

మొగుణ్ణి ఆఫీసుకి పంపించేసి తీరిక సమయాల్లో అయా గృహాలకు వేంచేసి వారివారి కష్టసుఖాలనూ సమస్యలనూ సమన్వయంగా విచారిస్తూ వారి వ్యక్తిగత సమస్యా పరిష్కార నిర్వహణ భారాన్ని పైన వేసుకోటం పిన్నిగారి దినచర్యలో ఒక భాగం. ఈవిడగారి పరామర్శలు క్రమంగా విమర్శలుగా మారి చివరికి వికృత రూపం తాల్చి ఇరుగు పొరుగు కుటుంబాల మధ్య కలహాలు పెరిగి కుటుంబాలకి కుటుంబాలే తరలి వెళ్ళి పిన్నిగారి శ్రీవారితో మొరపెట్టుకున్న సందర్భాలుకూడా లేకపోలేదు. శ్రీవారు శ్రీమతిగారి ప్రతాపం విని ఏకాంతంలో నెత్తీ నోరూ బాదుకుని (ఆవిడ ఎదురుగుండా బాదుకునే ధైర్యం లేక) ఏడిచేవారు. "భగవంతుడా! నన్ను ఆవిడ మొగుడుగా ఎందుకు సృష్టించావు చెప్పు? నేనేం పాపం చేశానని ఇటువంటి శిక్ష విధించావు తండ్రీ?" అని వాపోయేవాడు- అంతకంటె చేసేదేమీ లేక. ఇరుగు పొరుగు వాళ్ళంతా కూడా ఆయన ముఖం చూసి జాలిపడి పైకి ఏమీ అనలేక కోపం అణచుకుని వచ్చినదారినే వెళ్ళిపోయేవారు.

పొరుగింటి మేష్టరుగారి భార్య మాటలసందర్భంలో తనకి చీరెలు బొత్తిగా తక్కువగా ఉన్నాయనీ ఇబ్బందిగా ఉందనీ ఆయన ఆసంగతే పట్టించుకోరనీ యథాలాపంగా అన్నదిట. అంతే! మరుసటిరోజు మధ్యాహ్నానికల్లా పిన్నిగారు చీరెలవాడితోసహా మేష్టారింట్లో హాజరయింది "అబ్బే! ఊరికే అన్నాను పిన్నిగారూ! చీరెలు కొనడానికి ఇప్పుడు నాదగ్గర డబ్బెక్కడిదీ! అడిగితే ఆయన కోప్పడతారు కూడాను" అన్నదిట మేష్టరుగారి భార్య- "ఫర్వాలేదులే అమ్మాయ్! డబ్బు నెలాఖరుకి ఇద్దువుగానిలే రెండు చీరెలు తీసుకో" అని ఆవిణ్ణి బలవంతం చేసి రెండు చీరెలూ పాతిక రూపాయలకి బేరం ఫైసలు చేయించి "నెలాఖరుకి వచ్చి డబ్బు పట్టుకెళ్ళవోయ్"అని చీరెలవాడికి హుకుమ్ జారీచేశారు పిన్నిగారు.... తీరా చేస్తే సాయంకాలం మేస్టరుగారు ఇంటికి వస్తూనే- చేతిలో కానీలేకుండా బాధపడుతూంటే అప్పుచేసి పాతిక రూపాయల విలువచేసే చీరలు స్వతంత్రించి కొనేసిందనే అక్కసుతో భార్యమీద నోరుచేసుకున్నారు (చెయ్యి చేసుకో బోయారనికూడా వినికిడి!) భార్యా భర్తలిద్దరి మధ్యా రామరావణ యుద్ధం జరిగింది- ఇటువంటివే పిన్నిగారి పరోపకార పారీణతకు అస్మాదృశుల చర్మచక్షువులకు గోచరించే ప్రత్యక్ష ఫలితాలు.

రాజమ్మగారి మరిది నిరుద్యోగ సమస్య రాజమ్మగారినీ ఆమె భర్తగారినీ కంటె పిన్నిగారినే ఎక్కువగా బాధపెట్టేది. ఒకరోజున పిన్నిగారు రాజమ్మగారితో అన్నదట "ఇదేమిటమ్మా నీ మరిది ఇంకా ఎన్నాళ్ళు అన్నగారి సంపాదన తింటూ అలా దున్నపోతల్లే ఇంట్లోకూర్చుంటాడూ! కూర్చోపెట్టి మేపటం మాచేతకాదని చెప్పెయ్యండి. మీ ఆయనకి తెలియకపోతే నువ్వు అయినా చెప్పలేక పోయావూ? నీకు చేతకాకపోతే మి మరిదిని నాలుగు మాటలూ ఈ సారి నేనే అడుగుతా నుండు -- అయినా ఈ దొచ్చిన మొగాడు ఇరవైనాలుగు గంటలూ గోళ్ళు గిల్లుకుంటూ నీ ఎదురుగుండా కూర్చోవటమేమిటమ్మా సోద్దెంగానీ!" అన్నదట నదురూ బెదురూ

లేకుండా. పిన్నిగారి మాటలు వింటూంటే రాజమ్మగారికి ఒంటిమీద తేళ్ళూ జెఱ్ఱులూ పాకినట్లయిందట.... గదిలో నుంచి ఆ మరదిగారు పిన్నిగారి ఉపన్యాసం అంతా విన్నాడు. సాయంకాలం అన్నయ్యరాగానే ఇదికాస్తా ఆయన చెవిలో ఊదాడు. అదివిని ఆయన తోకతొక్కిన తాచులా మండిపడి సరాసరి పిన్నిగారింటికే వెళ్ళాడట. ఆవిడ అంతు కనుక్కుంటా నని. అదృష్టవశాత్తు ఆవిడ సమయానికి ఇంట్లోలేదు. ఆవిడ భర్తగారు ఇంట్లో ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. అంచేత రాజమ్మగారి భర్త వెళ్ళిన దారినే తిరిగివచ్చి "ఇహ ఆ రాక్షసిని మనవాకిట్లో అడుగు పెట్టనిచ్చావంటే ఊరుకోను. తెలిసిందా?" అని తర్జనీ చూపించి భార్యని గద్దించి తర్జన భర్జనచేసి పిన్నిగారిమీది విసుగంతా పెళ్ళాంమీద చూపించాడట. ఇదంతా పిన్ని గారు పొరుగింటి వారిపై ప్రసరింపజేసే అవ్యాజ కరుణా కటాక్ష వీక్షణల ఫలితం కాక మరేమిటంటారు!

పెళ్ళికానిపిల్ల పిన్నిగారి కంటపడితే చాలు ఇహ ఆ అమ్మాయిని నిలవేసి "ఏం అమ్మాయ్! ఇంకా వరుడు కుదర్లా? ఒక చెంపనెరిసే దాకా ఇలాగే ఉంటావా? అయినా ఈ రోజుల్లో పెళ్ళికూడా మోటు అయిపోయిం దిలే! పెళ్ళి చేసుకుంటే ఒకళ్ళ అధికారానికి లొంగి ఉండాలి. ఇష్టం వచ్చినట్టు అడ్డమయిన మగాడితోను స్వేచ్ఛగా కులుకుతూ పలుకుతూ తిరగటానిది వీలుండ దుగా!" అని ఫెడీలున అడిగేస్తుంది. ఆ అమ్మాయికూడా గడుసుపిల్ల అయిందా ఇహ వారిద్దరిమధ్యా కలహానికి ఆ సంభాషణే నాంది.

ప్లీడరుగారి కోడలు ఎక్కడ తారసిల్లినా సరే "ఏమ మ్మోయ్? ఇంకా ఇలాగే ఉన్నావే! పెళ్ళి అయి నాలు గేళ్ళు అయిందికదా! అయినా పిల్లల్ని కనడం ఫ్యాషన్ కాదు కాబోసులే! పిల్లల్ని కనటానికి కూడా కంట్రోలు పెట్టారటగా కంట్రోలూ? మీ కంట్రోళ్ళు పాడుగానూ, అందుకే ప్రపంచం ఇట్టావుంది" అని ఫెళ్ళున కట్టెవిరచి పొయ్యిలో పెట్టినట్టు అడిగేస్తుంది. ఎదుటివాళ్ళు ఎంత ఆరితేరిన వాళ్ళయినా ఆవిడనోటికి జడిసి తప్పుకు తిరుగు తూఉంటారు. కర్మంచాలక ఎవరైనా ఎదిరించారో ఇహ పిన్నిగారు వాళ్ళని హతమార్చిం దన్నమాటే! వాళ్ళమీద ఉన్నవీ లేనివీ కలిపించి కథలల్లి పదిమందిలో యాగీ చేస్తుంది.

నిజానికి పిన్నిగారు రాజకీయ రంగంలోకి వెడితే బాగా రాణించి ఉండేది. అందుకు తగిన లక్షణాలన్నీ కూడా ఆవిడలో మూర్తీభవించి ఉన్నాయి. అటువంటి సదవ కాశం ఏదీ రాకపోయినా ఉన్నకొద్దిపాటి అవకాశాలనే సద్వినియోగం చేసుకోవటంలో ఆవిడ తనతెలివితేటలను ప్రదర్శిస్తూనే ఉంటుంది.

పిన్నిగారు పొరుగున ఒకే కుటుంబంలో ఉండే నలు గురు వ్యక్తులతోను విడి విడిగా ఒకరిచాటున ఒకరితో ఎలాగో పరిచయం సంపాదిస్తుంది. క్రమంగా వారితో సన్నిహితత్వం సాధిస్తుంది. ఆ తరవాత ఆవిడ సరాసరి వారి అంతరంగిక జీవితాలలో ప్రవేశించి ఒకరిమీద ఒకరికి చాడీలు చెప్పి వారికి పరస్పరం ద్వేషం పుట్టిస్తుంది. తత్ఫలితంగా వారు ఒకరితో ఒకరు కీచులాడుకుంటూంటే కన్నులపండువుగా తిలకించి ఆనందిస్తుంది. ఇరుగు పొరు గున ఉన్న కాపురాలను ఈ విధంగా రచ్చ కీడవటం ఆవిడకు వినోదం.

ఇక పిన్నిగారినిచూసి ప్రజలు భయపడి దూరంగా తొలగి పోతారంటే ఆశ్చర్యమేముంది చెప్పండి. ఇరుగు పొరుగు కుటుంబాలలో వ్యక్తులూ ఈ విషయంలో ఒకే అభిప్రాయానికి వచ్చారంటే అందులో తప్పకుండా నిజం ఉండితీరాలి. అందుకే నాకూ అన్నయ్యకూ పిన్నిగారిని చూస్తే అంత భయం. ఆవిడ మా ఎదురుగా నించుంటే తోడేలు ఎదురుగా నించున్నట్లే ఉంటుంది. ఆవిడ మాటలు వింటూంటే పడగ విప్పిన తాచుపాము బుసలు వింటున్నట్లే ఉంటుంది. ఆవిణ్ణి తలచుకుంటేచాలు రాక్షస గణానికి చెందిన తాటకి శూర్పణఖ ఇత్యాది నారీమ తల్లులు స్మృతిపథంలో మెరుస్తారు.

అందుకే ఆవిడరాగానే నేనూ మా అన్నయ్యా అలా తొలగిపోతాం. "వెర్రివాడి పెళ్ళాం వాడకెల్లా వదిన" అన్నట్టు పిన్నిగారు మావాడలో ఆబాల గోపాలానికీ "పిన్నిగారే!" ....అన్నట్టు మీ ఇరుగు పొరుగునకూడా ఇటువంటి "పిన్నిగార్లు" తారసిల్లుతారేమో! కొంచెం జాగ్రత్తగా ఉండండి ఎందుకైనా మంచిది.